విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ప్రశాంత వాతావరణంలో 'పది' పరీక్షలు

విశాలాంధ్ర, మచిలీపట్నంటౌన్ : కృష్ణాజిల్లాలో పదవతరగతి పరీక్షలు ప్రశాంతవాతావరణంలో జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారిణి తహెరా సుల్తానా అన్నారు. సోమవారం ఆమె హైనీ ఉన్నత పాఠశాల, నిర్మల హై స్కూల్, చిలకలపూడి పాండురంగ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, రాంజీ హై స్కూల్ లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల విధానాన్ని తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కొన్ని కేంద్రాలను తనిఖీ చేశారని, జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్లు 33 కేంద్రాల్లో తనిఖీ నిర్వహించారని, ఎక్కడ ఇటువంటి అవాంతరాలు ఎదురు కాలేదని, ఎటువంటిమాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. 22615 మందికి గాను, 21499 మంది హాజరు కాగా 1116 మంది గైరాజరయ్యారన్నారు. హాజరు శాతం 95.07% అని అన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని 27 గ్రామాలకు టాంకర్లతో తాగునీటి సరఫరా చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన టెలి కాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడుతూ, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కృత్తివెన్ను మండలంలోఇంతేరు, ఉప్పులూరు, రామాపురం, సీతారాంపురం, మాట్లం, బంటుమిల్లి మండలంలో వడ్లగరువు, (హేమ్లెట్ఆఫ్ చోరంపూడి), మల్లంపూడి, గార్లగుంట, కొత్తూరు, పెడన మండలంలో కమలాపురం, ఉప్పల కలవగుంట, ఉప్పల కలవగుంటపాలెం, కొప్పల్లి, ముచ్చులిగుంట, ముచ్చర్ల, ముల మర్రిగుంట, గురువిందగుంట, కవి పురం, నేలకొండపల్లి, పెనుమల్లి, ఎస్వీపల్లి, చోడవరం, పుల్లపాడు, చినపుల్లపాడు, దేవరపల్లి గ్రామాలకు ఈనెల 20వ తేదీ నుండి ట్యాంకర్లతో సాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పాతతరం కమ్యూనిస్టులను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-గుడివాడ : పాతతరం కమ్యూనిస్టుల సేవలు పోరాటాలతో కూడినవి సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, ఆయన సతీమణి అరుణలు అన్నారు. స్థానిక పెద్దఎరికిపాడులోని సీనియర్ నాయకుడు కామ్రేడ్ గూడపాటి సువిశేశ్వరరావును సోమవారం ఆయన స్వగృహంలో పరామర్శించి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గూడపాటి పేదల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. ఆయన పోరాటాలు నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్బాబు, పార్టీ నాయకులు నిర్మలజ్యోతి, భవానీ, మేరిమ్మ, సునీత, సంతోషం ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు 'మోపిదేవి'

విశాలాంధ్ర-మోపిదేవి : నిబద్ధత గల కమ్యూనిస్టు మోపిదేవి వెంకటరావుని పలువురు వక్తలు నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు మోపిదేవి వెంకటరావు ప్రధమ వర్ధంతి మోపిదేవి లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ భావజాలంతో తుది శ్వాస వరకు జీవించిన మహోన్నత వ్యక్తి వెంకటరావు అని పేర్కొన్నారు. కామ్రేడ్ కంఠంనేని అచ్యుతరామయ్య సహచరుడిగా భారత కమ్యూనిస్టు పార్టీ తలపెట్టిన అనేక ఉద్యమాలలో ముందుండి నడిచేవారని గుర్తు చేశారు. పూటకో జండా మార్చే రాజకీయ నాయకులు ఉన్న నేటి రోజుల్లో కడవరకు ఎర్రజెండా నీడలో నిలిచి ఎందరికో ఆదర్శం గా నిలిచారన్నారు. ఆయన ఆశయాల కనగుణంగా నేటి తరం నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. తొలుత వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు మాలెంపాటి కాంచనరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు రావి ప్రభు ప్రసాద్, బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామ శివారు సింగన్నగూడెం పంచాయతీ కార్యదర్శి ఆల కళ్యాణిపై ఆ గ్రామ ప్రజలు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్కు ఎన్నికల కోడ్ ఉల్లంగించినదని ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం సర్పంచ్ కసుకుర్తి రంగమణి విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి నిబంధనలను ఉల్లంఘించి అధికారంలో ఉన్న తమను కాదని ప్రతిపక్ష వైసీపీ కార్యకర్తలకు పెద్దపీట వేస్తూ ఇంతకాలం పెత్తనం చెలాయించిందని, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా వారిని సిసి రోడ్డు పనుల ప్రారంభానికి ఆహ్వానించడంతో ఆమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసామని, వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం మచిలీపట్నం వచ్చి కలెక్టర్ లేకపోవడంతో డి.ఆర్.వోకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2021లో ఎంపీటీసీగా గెలిచిన తనను కాదని గ్రామంలో అధికార కార్యక్రమాలనువైసీపీ నాయకులతో చేపించి ప్రోటోకాల్ ఉల్లంగిస్తున్నదని, రంగన్నగూడెంలో ఇళ్ల స్థలాలకు సంబంధించి సింగన్నగూడెం గోతుల చెరువు ప్రతిపాదన పై హైకోర్టు లో స్టే ఫోర్స్ లోఉండగా, గ్రామ సచివాలయంలో జిల్లా వైసీపీ నాయకులతో మీటింగ్ పెట్టి ప్రజలకు వెళ్ళ పట్టాలు ఇస్తామని ప్రచారం చేస్తున్నదన్నారు. ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు మాట్లాడుతూ ఆల కళ్యాణి స్థానికరాలు కావడంఆమె భర్త, తండ్రి వైసీపీ మద్దతు దారులు కావడం, ఆమె ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తున్నా రని, ఎన్నికలవరకు ఆమెనువేరే మండలానికి బదిలీ చేసి రంగన్న గూడెంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగన్న గూడెం ఎం.పి.ఎం. ఎ.సి.ఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు, సింగన్నగూడెం ఎం.పి.ఎం.ఎ.సి. ఎస్ అధ్యక్షురాలు మరీదు కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కూటమిదే అధికారం : కొనకళ్ల

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం: ప్రజాగళం ఘన విజయం కావడంతో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి అధికారంలో కి రావడం తథ్యమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారని, వైఎస్సార్ సీపీ, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలు వేరు కాదని ఈ రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందినవని, జగన్ రెడ్డి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందని, రాష్ట్రంలోని వైకాపా మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వారికి అర్థమైందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలుగుదేశం ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 72% పూర్తి చేస్తే, 2019 లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ ను అడ్డుకుందన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అధ్వాన్నంగా మారాయని, జగన్ పాలన ఆర్థిక దుర్వినియోగం, అవినీతిలకు మారుపేరుగా మారిందన్నారు.కలెక్టరేట్ కార్యాలయాలు, రైతు బజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలలతో సహా అనేక ప్రభుత్వ ఆస్తులను జగన్ ప్రభుత్వం తనఖా పెట్టిందని, రాబోయో ఎన్నికల్లో తెదేపా జనసేన భాజపా కూటమి ఘన విజయం సాధిస్తుంది, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో తెదేపా జనసేన భాజపా కూటమి అధికారంలోకి రాబోతున్నాయని, వైసిపిప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో ప్రజా గళం సభకు హాజరైన ప్రజానీకాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు అన్నారు.

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృషి

విశాలాంధ్ర-పెడన: పెడన మండలం పెద పుల్లపాడు, చోడవరం పాల ఉత్పత్తి దారుల అసోసియేషన్ లను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సందర్శించి పాల ఉత్పత్తి దారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.పాల ఉత్పత్తిదారులకు మేలైన యాజమాన్య పద్ధతులు, మరియు మెరుగైన పశుపోషణ కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తి దారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని తెలిపారు పాల ఉత్పత్తిదారులకు ప్రతి నాలుగు మాసములకు 10% చొప్పున ధర వ్యత్యాసం(బోనస్) పంపిణీ చేయడం జరుగుతున్నది అని, క్షీర బంధు, కళ్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా పశు వైద్య శిబిరాలు జలగ ముందు అందిస్తున్నామని , సబ్సిడీపై 20% ప్రోటీన్ కలిగిన పశుదాణా మరియు పశువులకు మేలుజాతి కృత్రిమ గర్భోత్పత్తి సేవలు రూ.50/- లకే చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలక వర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్ , గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ , అసోసియేషన్ ల అధ్యక్షులు లు గూడపల్లి నాగరాజు, వుచా జ్వాల బాబు, సూపర్ వైజర్ పేయ్యేటి బసవ రాజ కుమార్, మరియు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

'శివరాణి'కి అవార్డు

విశాలాంధ్ర-కూచిపూడి : రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా మొవ్వ గ్రామానికి చెందిన బొందలపాటి (మేకా) శివరాణికి"రైతు నేస్తం"అవార్డు లభించింది. ఆమెను తుమ్మేటిరఘోత్తమ రెడ్డి మిద్దె తోట పురస్కారం ను రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వర ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఎఫ్ టి సి సి ఐ(లకడికాపూల్) భవనంలో సత్కరించారు. ఈ విషయాన్ని ఆమె సోమవారం మొవ్వ లో వెల్లడి చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎం హనుమంతరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్.జాతీయ ఉపాధ్యక్షులు ఏం కోదండ రెడ్డి, మిద్దె తోట నిపుణులుతుమ్మేటి రఘోత్తమ రెడ్డి, మిద్దె తోట నిపుణురాలు పిన్నక పద్మ లు ఈ అవార్డు అందజేశారు. పెరటి తోట(మిద్దె తోట)లో ప్రకృతి వ్యవసాయ రీతిలో మొక్కల పోషణ లాంటి బృహత్తర కార్యక్రమాలను కొనసాగిస్తున్న శివరాణి ని అభినందించి శాలువా ప్రశంసా పత్రంతో జ్ఞాపిక లతో సత్కరించారు. ఆమె తన పెరటి తోటను నందనవనంగాతీర్చిదిద్ది తనకున్న సమయాన్ని కేటాయించి మొక్కలను, పూల తోటలను ఏ విధమైన రసాయనాలు వాడకుండా ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడంతోశివరాణిఈ అవార్డు కైవసంచేసుకున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగాయి. మండలంలోని ఏడు కేంద్రాలలో రెగ్యులర్, సప్లమెంటరీ విద్యార్థులు 601 మందికి 21 మంది గేర్ హాజరు కాగా 580 మంది పరీక్షలు రాశారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ హై స్కూల్ పరీక్షా కేంద్రంలోచినముత్తేవిజడ్పీ హైస్కూలు, వేదిక్ శ్రీ మేధా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు కలిపి 68మంది, మొవ్వ హైస్కూల్లోలిఏ,బిలికేంద్రాలలో హెూలీ స్పిరిట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు తో 234 మంది, కోసూరు హైస్కూల్ కేంద్రంలో, పెదముత్తేవి ఓరియంటల్ స్కూల్ విద్యార్థులు, మల్లంపల్లి (ఘంటసాల మండలం) హై స్కూల్ విద్యార్థులు, విజయశ్రీ నన్నవర్ పాఠశాల విద్యార్థులు కలిపి 90 మంది, కాజ హైస్కూల్లో గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు తో కలిపి 66 మంది, పెడసనగల్లు హైస్కూల్లో భట్ల పెనుమర్రు హైస్కూల్ విద్యార్థులతో కలిపి 81మంది, నిడుమోలు కేంద్రం లో 41మంది పరీక్షలకు హాజరయ్యారు. నిడుమోలు పరీక్ష కేంద్రానికి ప్రశ్నాప త్రాలను గూడూరు పోలీస్ స్టేషన్ నుంచి కస్టోడియల్స్ తీసుకురాగా, మిగిలిన కేంద్రాలకు కూచిపూడి పోలీస్ స్టేషన్ నుంచి పంపిణీ చేశారు. పరీక్ష కేంద్రాల్లోని విద్యార్థుల ఆన్సర్ షీట్ల కట్టలను సమీప పోస్ట్ ఆఫీస్ లో భద్రపరిచారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్ఐ

మొవ్వమండలంలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తొలిరోజైన సోమవారం కూచిపూడి ఎస్ఐ టి శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన కూచిపూడి, పెడసనగల్లు, మొవ్వ-ఏ, మొవ్వ-బి, కోసూరు, కాజ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా కేంద్రాల సిఎస్ సి హెచ్ ఎస్ కే బి సుబ్రహ్మణ్యం, ఎస్ వి కోటేశ్వరరావు, కే శిరీష, కే మాధవి, గుడివాడ శ్రీహరి, ఎంఎస్ సాయికుమార్ ల ద్వారా వివరాలను సేకరించారు.

ఒంటిపూట బడులు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : విద్యాశాఖ ఆదేశాలతో సోమవారం నుంచిఒంటి పూటబడులు ప్రారంభమైనాయి. మొవ్వ మండలంలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలు కొనసాగుతున్న కూచిపూడి, పెడసన గల్లు, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వ జిల్లా పరిషత్ హైస్కూళ్ళలో పరీక్షలు అయ్యేవరకు మూడు నుంచి తొమ్మిదవ తరగతి వరకు పిల్లలకు మధ్యాహ్నం వేళలో పాఠశాలలు నిర్వహించారు మిగిలిన ఎలిమెంటరీ, యూపీ, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఉదయం 7:45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించే ఒంటిపూట బడులకు తొలి రోజు 4856 మందికి 3400 మంది విద్యార్థులుహాజరవగా 1456 మంది గైర్హాజరైనట్లు సమా చారం. ఉదయం 10 నుండి-10:30 గంటల మధ్య పావు గంట సేపు కొనసాగిన విరామంలో విద్యార్థులకు చిక్కి (వేరుశనగ పప్పు చెక్క) ప్యాకెట్లుపంపిణీ చేశారు. అలాగే 12:30 గంటల తర్వాత మధ్యాహ్న భోజన పథకం (జగనన్న గోరుముద్ద) అమలు పరిచి పిల్లల్ని ఇండ్లకు పంపారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్ష కేంద్రాలలో సైతం మధ్యాహ్నం నుంచి నిర్వహించే తరగతుల పిల్లలకు జగనన్న గోరుముద్ద(మధ్యాహ్న భోజన పథకం)నుఅమలు చేశారు.

పల్లెల్లో ప్రశాంతతే లక్ష్యం

విశాలాంధ్ర-పమిడిముక్కల: పల్లెల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలీసులు సహకారం ఎప్పుడూ వుంటుందని పమిడిముక్కల సి.ఐ.కిషోర బాబు అన్నారు.సోమవారం ఎన్నికల నేపథ్యంలో మర్రి వాడ, మంటాడ, కపిలేశ్వరపురం, కృష్ణాపురం, చోరగుడి, శ్రీరంగపురం, లంకపల్లి, ఐనపూరు, కూడేరు లలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, గుడివాడ డిఎస్పీ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలు తో కవాతు చేసి సదరు గ్రామాల్లోని ప్రజలందరూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కు స్వేచ్ఛ గా వినియోగించుటకు ధైర్యాన్ని నింపి ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పోలీసులు ఏ సమయంలో అయినా మీకు అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చైల్డ్హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డి లీలా కృష్ణ అన్నారు. చైల్డ్హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆద్వర్యంలో సోషల్ సర్వీసు కార్యాలయం వద్ద ఒక చలివేంద్రం, పులిగడ్డ సర్కిల్లో మరొక చలివేంద్రం మొత్తం 2 చలివేంద్రాలు 2వ సంవత్సరం నడుపుతన్నట్లు, ఈ సంవత్సరం చలివేంద్రాలను ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ అలపర్తి గోపాలకృష్ణ, మోపిదేవి శ్రీనివాసరావు, కమ్మిలి ప్రసాద్, ఠాగూర్, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ సబ్-రిజిస్ట్రర్ వారి యీలాకా విజయవాడ, దేవినగర్, 8వ వీధి కాపురస్తులు **పుప్పాల లేటు హరిచంద్రరావు గారి కుమారుడు లీలా కృష్ణ కిషోర్** నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా...
నా క్లయింట్ కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రర్ వారి యీలాకా మచిలీపట్నం, దేశాయ్ పేట కాపురస్తులు **కాట్రగడ్డ శ్రీనివాసరావు** గారి కుమారుడు **వెంకట రంగారావు**, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం, రామలక్ష్మణ నగర్ కాపురస్తులు **నూకల లేటు రామాంజనేయులు** గారి కుమారులు **1) నూకల శ్రీరామ్ 2) నూకల శ్రీ కృష్ణా గార్లకు** జి.పి.ఏ గ వ్యవహరించుచు ఉన్నారు అట్లా సదరు వారికి ఆర్థిక అవసరాలు రీత్యా డబ్బులు అవసరమై ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని అమ్మజూపగా నా క్లయింట్ సదరు జి.పి.ఏ హోల్డర్ వద్ద **దీ.23.02.2024**న షెడ్యూల్ దాఖలా ఆస్తిని విక్రయ ఆ స్వాధీన అగ్రిమెంట్ ద్వారా **రూ.35,00,000/- (అక్షరాల ముప్పది ఐదు లక్షల రూపాయలకు)** కొనుగోలు చేసి ధరావత్తులో **రూ.5,00,000/-** అడ్వాన్సుగా ఇచ్చి ఆ స్వాధీన అగ్రిమెంట్ పొందినారు. కావున షెడ్యూల్ దాఖలా ఆస్తిపై అన్యులు గాని యవత్తు ప్రజానీకం గాని ఏవిధమైన అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 దినములలో నేరుగా నా క్లయింట్లకు గాని లేక నాకు గాని తమ అభ్యంతరాలు తెలియజేయగలరు. అట్లు అభ్యం తరాలు ఏమియు రానియెడల ఈ షెడ్యూల్ దాఖలా ఆస్తి నిపేక్ష ఆస్తిగా భావించి నా క్లయింట్ సదరు అమ్మకందారులు దారుల నుండి సరియగు క్రయ దస్తావేజు వ్రాయుంచు కొనగలరు. సదరు గడువు తీరిన ధర్మిలా వచ్చు అభ్యంతరాలు నా క్లయింట్ను బాధ్యుదు చేయజాలవు అని ఇందు మూలముగా తెలియచేయడమైనది.
షెడ్యూల్ ఆస్తి: కృష్ణాజిల్లా, బందరు సబ్ రిజిస్ట్రర్ వారి యీలాకా, మచిలీపట్టణం, మాచవరం రు లోని సర్వే నెంబర్ **180/2,లో** యు **1.84** సెంట్లు లో సుమారు **1000** చ.గ హద్దులు : **తూర్పు:** మా తాలుకు మిగిలిన స్థలం **దక్షిణం:** ఆ 10 .00 అడుగుల వెడల్పు గల ఉమ్మడి దారి **పడమర :** ఆ 12.00 అడుగుల వెడల్పు గల ఉమ్మడి దారి **ఉత్తరం:** సాదు గాంధీ వగైరాలు పై హద్దుల మధ్య సుమారు 1000 చ.గ సర్వ హక్కులతో

కన్నంరెడ్డి శ్రీమన్నారాయణ మూర్తి, న్యాయవాది
16/448, మాచవరం మెట్టు
మచిలీపట్నం, సెల్ : 9346312022
మచిలీపట్నం 18.03.2024

13 సెంటర్లలో టెన్త్ పరీక్షలు

విశాలాంధ్ర-గుడివాడ : నియోజకవర్గంలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు 13 సెంటర్లులో పరీక్షలు నిర్వహించడం జరిగింది. నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు. చేరుకున్నారు. ఏట్టువంటి అవాంఛనీయ సమస్యలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు చర్యలు తీసుకుని, పోలీసులను ఏర్పాటు చేశారు.

523 మంది పరీక్షలకు హాజరు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలో పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైయ్యాయి. గుడ్లవల్లేరు మండలంలోనీ పరీక్ష కేంద్రాలైన ఎస్ఆర్ఎం, అంగలూరు బాలుర జడ్పీ, కౌతరం జడ్పీ, డోకిపర్రు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ విద్యార్థులు 436 మంది మరియు ప్రైవేట్ విద్యార్థులు 119 మంది విద్యార్థులు మొత్తం 555 మందికి 523 మంది సోమవారం పరీక్షలకు హాజరు అయినట్లు మండల విద్యాశాఖాధికారులు జె. జగన్మోహనరావు, జి.గోపాలరావులు తెలిపారు. అలాగే గుడ్లవల్లేరు మండలంలో ఎస్ఐ సత్యనారాయణ, ఎఎస్ఐలు సారధి, సాంబశివరావులు పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సహకారంతో సోమవారం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఇఓలు తెలిపారు.

మానసిక ఆరోగ్యానికి 'అవిక' యాప్ వరం

విశాలాంధ్ర విజయవాడ (వన్ టౌన్) :- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఎంతోకొంత మానసిక ఒత్తిడి, సమస్యలు ఉంటున్నాయని అలాంటి వారందరికీ అవిక యాప్ గొప్ప వరమని రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. సూర్యారావుపేటలోని ఇండ్లాస్ హాస్పిటల్లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అవిక యాప్ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ, మానసిక సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా రూపొందించిన అవిక యాప్ దేశంలోనే మొట్టమొదటిగా భావిస్తున్నట్లు తెలిపారు. అవిక యాప్ను రూపొందించిన ఇండ్లాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ ఇండ్లను, అవిక టీమ్ సీఈవో శిరీష పెయ్యేటి బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉన్నత విద్య శాఖ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ, అవిక యాప్ కేవలం మానసిక సమస్యలున్నవారికే కాకుండా పరీక్షల ఒత్తిడి, ఏకాగ్రత లేకపోవడం, బెట్టింగ్, ప్రేమ వ్యవహారాలు, డ్రగ్స్కు అలవాటు పడడం, ఆత్మహత్య తలంపులు, నిద్రలేమి లాంటి సమస్యలున్న వారికి కూడా ఉపయోగపడే గొప్ప సాధనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీల విద్యార్థులకు కూడా అవిక యాప్ను అందుబాటులోకి తెస్తామన్నారు. వైయస్సార్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీని ఆధారం చేసుకుని రూపొందించిన అవిక యాప్ వైద్య రంగంలో ఒక విప్లవాత్మక అధ్యాయానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఇండ్లాస్ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అవిక మెడికల్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ మాట్లాడుతూ, అవిక యాప్ ప్రత్యేకతలను వివరించారు. అవిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శిరీష మాట్లాడుతూ, పెరుగుతున్న మానసిక సమస్యలకు అధునాత వైద్య చికిత్సలు అందిస్తున్న ఇండ్లాస్ హాస్పిటల్స్తో కలిసి వినూత్న విధానాలను అందించేందుకు తమ సంస్థ ఈ విధంగా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. అతి త్వరలో అవిక సేవలను దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా విస్తరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అతిథులను అవిక టీమ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

అడాపా బాబ్జీ 3వ వర్ధంతి

విశాలాంధ్ర-గుడివాడ : అందరితోను కలసి ఉండే మహోనత వ్యక్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అడపా వెంకటరమణ(బాబ్జీ) అని వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా నాయకులు మండలి హనుమంతరావులు అన్నారు. సోమవారం స్థానిక శరత్థియేటర్లోని వైసిపి కార్యాలయంలో అడపా బాబ్జీ 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటాకి పూలమాలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంలో అందరితో కలసి మెలసి ఉండే నాయకుడు అడపా అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నాయకులు వెంపటి సైమన్, చింతల భాస్కర్, చూండూరి శేఖర్, కొంకితల అంజనేయప్రసాద్, అల్లం రామెహ్మన రావు, రేమల్లి నీలాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బొగ్గవరపు

విశాలాంధ్ర-వత్సవాయి : స్థానిక వాసవి కళ్యాణమండపం ప్రాంగణంలో ఎన్టీఆర్ జిల్లా తొలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా బొగ్గవరపు వెంకటరాజారావు మరియు జిల్లా మహిళా విభాగం, యువజన సంఘం విభాగం, మరియు కార్యవర్గ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఇంతటి నమ్మకంతో సేవలను గుర్తించి జిల్లాలోనే మొట్టమొదటి ఇంతటి ఘనమైన బాధ్యతతో కూడి ఉన్న పదవిని ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని సమగ్ర స్థాయిలో కృషిచేసి అందరినీ ముందుకు నడిపే విధంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు రామ చిన్ని రామ సత్యనారాయణ , మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య,అంబికా కృష్ణ , క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు ,మాజీ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు , పెనుగొండ సుబ్బారాయుడు ,మహిళా విభాగం అధ్యక్షురాలు కొప్పురావూరి రజినీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-విజయవాడ : ఎన్టీఆర్ జిల్లాలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక దాసరి భవన్‌లో సోమవారం జరిగిన జిల్లా కార్య వర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు తూము కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లాలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కార్యవర్గ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఆ వైపుగా జిల్లాలో పార్టీ శ్రేణులను, పార్టీ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయాలని ఉద్బోధించారు. బీజేపీతో అంటకాగే చంద్రబాబు, పవన్, మోదీల ఎన్‌డీఏ కూటమిని, అప్రజాస్వామ్య పాలనతో ఈ రాష్ట్రాన్ని వెనక్కి మళ్ళించిన జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య వంతులను చేయాలని కోరారు. లౌకిక వ్యవస్థ పరిరక్షణకు మతం పేరుతో దేశాన్ని విభజించాలనే చూసే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిని ఓడించాలని, వైసీపీని ఓడిరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 18 నుంచి నామిషన్లు స్వీకరణ : కమిషనర్ దినకర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఈ నెల 16వ తేదీన భారత ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం విజయవాడ సెంట్రల్ నియోజక వర్గంలో పోటీ చేసే అభ్యర్థులు ఏప్రిల్ 18వ తేదీ నుంచి నామిషన్లు స్వీకరించటం జరుగుతుందని ఈ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన వాహనాలు, మైక్, పార్టీ కార్యాలయాలు, ఊరేగింపులు, బహిరంగ సభ, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఇతర అనుమతులు పొందాలని తెలిపారు. ఇందుకు విజయవాడ సెంట్రల్ నియోజక వర్గంలోని పోలింగ్ స్టేషన్లు 1 నుంచి 257 వరకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, కెనాల్ రోడ్డు వన్‌టౌన్, జవహర్ లాల్ నెహ్రూ బిల్డింగ్‌లోని సిటిజన్ చార్టర్ కౌంట్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో కౌంటర్ నుంచి అనుమతులకు రిటర్నింగ్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సా॥ 6:23
సహరి : బుధవారం ఉ॥ 4:56

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

'పది' పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో పరీక్షలు జరుగుతున్న తీరును కలెక్టర్ సోమవారం ఆయా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక గవర్నర్‌పేట చుండూరు వెంటరెడ్డి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతారణంలో పరీక్షలు రాసేందుకు చేసిన ఏర్పాట్లును కూడా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి ఏర్పాట్లు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ పోన్లు, ఏవిదమైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లును తీసురాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వాహణలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని చీఫ్ సూపరింటెంట్లుకు, పరీక్ష నిర్వాహణలో భాగస్వాములైన అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 178 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాని, ఈ పరీక్షలు ఈనెల 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

పటిష్ట సమన్వయానికి కమాండ్ కంట్రోల్ కేంద్రం

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని (ఐసీసీసీ) ఏర్పాటు చేయడం జరిగిందని.. అధికారులు బృంద స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ డిల్లీరావు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటాతో కలిసి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం కార్యకలాపాలను పరిశీలించారు. సీ-విజిల్, కాల్‌సెంటర్, ఎన్నికల వ్యయ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్), ఎంసీసీ, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ తదితర విభాగాల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ స్క్వాడ్స్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, స్వీప్ కార్యక్రమాలు తదితరాల మధ్య పటిష్ట సమన్వయ సాధనకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం కీలకమన్నారు. సీ విజిల్, నేషనల్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ సిస్టమ్ (ఎన్‌జీఆర్ఎస్), 1950 తదితర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడం ఎంత ముఖ్యమో సరైన విధంగా నివేదికల్లో పొందుపరిచి ఏరోజుకారోజు సమర్పించడం ముఖ్యమన్నారు. క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు అనుసంధానమవుతూ నాణ్యమైన, కచ్చితమైన నివేదికలు రూపొందించాలన్నారు. విధుల నిర్వహణలో వేగంతో పాటు కచ్చితత్వం కూడా ముఖ్యమని కలెక్టర్ డిల్లీరావు స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

సామాజిక న్యాయమే లక్ష్యం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించి వారందరికీ సామాజిక న్యాయం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు కంఠమనేని ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసింది అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గారు బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ గా సముచిత స్థానం కల్పించారు అని అన్నారు. యాదవ సోదరులను చంద్రబాబు నాయుడు మోసం చేశాడు అని కానీ మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గారు యాదవులకు రాజ్యసభ సీటు ఇవ్వడమే కాకుండా అన్ని పదవులలో బీసీలకు సముచిత స్థానం కల్పించారు అని చెప్పారు. అలాగే జగ్గయ్యపేట నియోజకవర్గ చరిత్రలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవితోపాటు అత్యంత పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలు ఆలయ చైర్మన్ పదవి కూడా యాదవ సోదరులకు తానే ఇచ్చానని తెలుగుదేశం మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య పదేళ్ల అధికారంలో ఉండి యాదవ్ సోదరులకు ఏమి న్యాయం చేశాడు అని ప్రశ్నించారు. ఈ విషయాలను యాదవ సోదరులు ప్రతి ఇంటికి తెలపాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు ఎవరు సముచిత స్థానం కల్పించారో గమనించి వరకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వామపక్ష అభ్యర్థులను అసెంబ్లీకి పంపండి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజా సమస్యలపై గొంతెత్తే ఎర్రజెండా పార్టీల ప్రతినిధులను అసెంబ్లీకి పంపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి ఎన్నికల బరిలో ఉంటున్నారని తెలిపారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లాల సమితుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక సితారా సెంటర్ వద్ద గల ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగిన ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ తనకు మూడవ సారి సొంతంగా 370 సీట్లు, ఎన్‌డీఏకు 400 సీట్లు వస్తాయని మైండ్ గేమ్ అడుతుందని మండిపడ్డారు. దేశంలో అన్ని మతాలు, కులాలు కలిసి ఉండటానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణం అన్నారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసింది ఏమీ చెప్పుకోలేని పరిస్థితుల్లో మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందన్నారు. ప్రాంతీయ పార్టీలను మింగేయటమే బీజేపీ అజెండాగా ఉందన్నారు. సీఎం జగన్‌కు ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేదన్నారు. జగన్ సామాజిక న్యాయం పాటిస్తున్నట్లు చెప్పటం అవాస్తవం అన్నారు. విజయవాడ పశ్చిమలో సీపీఐ గెలుపు ఖాయం: రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు ఓట్లు వేయరని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి విజయం సాధించటం తథ్యం అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ రాక్షస పాలన చేస్తున్నారని విమర్శించారు. ఒక సామాన్య వ్యక్తి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ తరుపున పోటీలో ఉంటున్నారని చెప్పారు. కాంగ్రెస్, సీపీఎం పార్టీల మద్దతులో ఎన్నికల రంగంలో ఉన్న సీపీఐ అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వామపక్షాల నాయకత్వంలనే విజయవాడ నగరం అభివృద్ధి చెందింది అన్నారు. తమ్మిన పోతరాజు, రామచంద్రమూర్తి, కె.సుబ్బరాజు, నాసర్‌వలి, ప్రథమ మేయర్ టి.వేంకటేశ్వరరావు, లంకా గోవింద రాజులు, ఐయితా రాములు తదితరుల మార్గదర్శనంలో నగరంలో అభివృద్ధిలో దూసుకుపోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ కార్పోరేషన్ ఎన్నికల సందర్భంగా పన్నులు పెంచమని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత నీటిపన్ను, చెత్త పన్ను, డ్రైనేజీ పన్ను వంటి రకరకాల పన్నులతో పేదల నడ్డివిరుస్తున్నారని మండిపడ్డారు. నగరంలో ఎన్నికల బరిలో ఉన్న సీపీఐ అభ్యర్థి విజయం కోసం పార్టీ నాయకులు, ప్రజాసంఘాలు ముందుకు రావాలని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 254 బూతులు, 64 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఓటరు నమోదుపై పార్టీ శ్రేణులు ప్రజలకు అవగాహన కలిగిస్తాయని చెప్పారు. ఈ సమావేశానికి సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య స్వాగతం పలికారు. విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు వందన సమర్పణ చేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నాయకులు ఎస్‌కే.నజీర్, కేవీ భాస్కరరావు, డి.సూరిబాబు, శర్మ తదితరుల బృందం కమ్యూనిస్టు సిద్ధాంతాలను వివరిస్తూ అభ్యుదయ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు, సీపీఐ కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, సీపీఐ సీనియర్ నాయకులు కొరగంజి దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల పరిధిలోని జుజ్జూరు, అల్లూరు, జయంతి, వీరులపాడు గ్రామాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లను మండల తహశీల్దార్ రాజ కిషోర్ తన సిబ్బందితో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో విద్యార్థిని విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల ఎస్సై మహాలక్ష్ముడు అన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పోలీసు వారి తరపునుంచి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

కూటమిదే ఘన విజయం : నెట్టెం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : జగన్ రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిర్ణయించుకున్నారని, వైకాపా ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారని మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన స్వగృహం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో మాట్లాడుతూ జగన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనం అయిందని, వైఎస్సార్ సీపీ, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలు వేరు కాదని ఈ రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందినవన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, జగన్ ప్రభుత్వాన్నిఅధికారం నుంచి దింపాలని కోరారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందని, రాష్ట్రంలోని వైకాపా మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారని అన్నారు.. జగన్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వారికి అర్థమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలుగుదేశం ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 72% పూర్తి చేసిందని . 2019 లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ ను అడ్డుకుందని విమర్శించారు. వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అధ్వాన్నంగా మారాయని, జగన్ పాలన ఆర్థిక దుర్వినియోగం, అవినీతిలకు మారుపేరుగా మారిందని తెలిపారు.. లక్షల జగన్ రెడ్డి బొమ్మ ప్రచారానికి, కోర్టు కేసులకు వేల కోట్లు ఖర్చుకోట్లు లూటీ, దుబారా చేశారు. జగన్ పార్టీని వచ్చే ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించకపోతే రేపు మన ప్రయివేటు ఆస్తుల్ని, భూముల్ని తాకట్టుపెట్టి లక్షల కోట్లు అప్పు తెచ్చి లూటీ చేస్తారని ఎద్దెవా చేసారు. ప్రయివేటు భూముల తాకట్టు కోసమే లాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారని, పౌరుల భూముల ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలు ప్రభుత్వం దగ్గర పెట్టుకొని జిరాక్స్ యజమానికి ఇస్తారు. పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ బొమ్మ వేశారని పేర్కొన్నారు. జగన్ ని ఓడించకపోతే సచివాలయమే కాదు రేపు ప్రయివేటు భూముల్ని కూడా తాకట్టు పెడతారన్నారు. ఏపీ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధితో కూడిన సమర్థవంతమైన పరిపాలనకు కూటమి ఆధ్వర్యంలో భవిష్యత్తులో నాంది పలుకుతుందని తెలిపారు.

ఎన్నికలప్పుడే ముస్లీంలు గుర్తుకు వస్తారు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాజకీయ పక్షాలకు ఎన్నికల్లో మాత్రమే ముస్లింలు గుర్తుకు వస్తున్నారని ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక తమ సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు నాగూర్ షేక్ ఆరోపించారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వమించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12% ఉన్న ముస్లిం జనాభాకి ఒక్క పార్లమెంటు స్థానం కూడా కేటాయించకపోవడం దారుణం అన్నారు. 25 పార్లమెంటు స్థానాలు ఉన్నాయని అందులో ముస్లింలకు రెండు స్థానాలు అయిన కేటాయించాలని డిమాండ్ చేశారు. వక్ బోర్డ్ ఆస్తులకి ప్రత్యేక చట్టం తీసుకువస్తామని ప్రతి ఎన్నికలలో పార్టీలు చెప్పటం అనంతరం దానిని విస్మరించడం జరుగుతుందన్నారు. ఏ పార్టీ కూడా నామినేటెడ్ పదవులు ఇవ్వలేదన్నారు. మాకు రాజకీయ అవకాశాలు జనాభా నిష్పత్తి ప్రకారం కల్పించాలన్నారు. ముస్లిం పెద్దలతో చర్చించి ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలో తెలియజేస్తామని అన్నారు. తాము అందరూ ఐక్యమత్యం గా ఉండి ఏ పార్టీకి మద్దతు లేకుండా అన్ని సంఘాల్ని కలుపుకొని రానున్న రోజుల్లో ఓటు అనేది ఓటు విలువ ఎలా ఉంటుందో తెలియపరచడానికి ప్రతి గడపకి వెళ్లి మన సమస్యలు పరిష్కరించి వాళ్లకే మనం ఓట్లు వేద్దాం అని చేప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మహబూబ్ సుభాని, ఫరీద్ షేక్, ఝాకిరియా, తదితరులు పాల్గొన్నారు.

కూమార్తెపై లైంగిక దాడి- జీవితఖైదు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్) : కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి విజయవాడ పోక్సో స్పెషల్ కోర్ట్ న్యాయమూర్తి డాక్టర్ ఎస్. రజని జీవిత ఖైదు (బతికి ఉన్నత కాలం) విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసు నమోదు చేసిన 8 నెలల కాలంలో నిందితుడికి శిక్ష పడింది. విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఫిర్యాదికి ఇద్దరు బాలికలు, ఒక బాబు సంతానం ఉన్నట్లు, భర్త దగ్గరలోని షామియానా షాప్‌లో పనిచేస్తున్నట్లు, ఫిర్యాది పెద్ద కుమార్తె (15సం.) దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. మిగిలిన ఇద్దరు పిల్లలు అదే పాఠశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో పెద్దకుమార్తె అయిన మైనర్ గత రెండు రోజులుగా వాంతులు అవుతూ నీరసంగా ఉండటంతో గత సంవత్సరం జూలై 2వ తేదీన హాస్పిటల్‌లో చూపించగా డాక్టర్ సదరు బాలిక గర్భవతి అయినట్లు చెప్పడంతో ఫిర్యాది బాలికను ఇంటికి తీసుకువెళ్ళి అడుగగా ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో తండ్రి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ పలుమార్లు అత్యాచారం చేసినట్లు తెలిపింది. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తా అని బెదిరించిచాడు. బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు నిందితుడు దాసరి దత్తును అరెస్టు అరెస్టు చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం ఋజువైనందున్న, జీవితకాల (చనిపోయేంతవరకు) జైలుశిక్ష రూ.40 వేలు జరిమానా విధిస్తూ, జరిమానా మొత్తం బాలికకు చెందేవిధంగా, బాధిత బాలికకు రూ.5 లక్షలు నష్టపరిహారం వచ్చేవిధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ వారిని ఆదేశించారు.

పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రచార మాధ్యమాల్లో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా ఉంచాలని, ఈ విషయంలో ప్రచార మాధ్యమాల ప్రతినిదులు అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఎన్నికల్లో ప్రచార మాధ్యమాలు అనుసరించాల్సిన విదివిధానాలపై స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాలను మీడియా యూనిట్లు పాటించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మీడియా మాధ్యమాలు, మీడియా ప్రతినిదులు అనుసరించాల్సిన విదివిదానాలను వివరిస్తూ ఎన్నికను నిష్పక్షపాతంగా, ప్రశాంత యుతంగా నిర్వహించటంలో మీడియా పాత్ర కీలకమన్నారు. అందుకు అన్ని మాధ్యమాల ప్రతినిదులు సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెయిడ్ న్యూస్ అంశాన్ని ఆయన వివరిస్తూ అభ్యర్థి నామినేషన్ దాకలు చేసినప్పటి నుంచి పెయిడ్ న్యూస్ అంశాన్ని పరిశీలించాలన్నారు. జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ పటిష్ట పర్యవేక్షణతో పని చేయాలన్నారు. నిర్దేశించిన రేట్ కార్డు ప్రకారం పెయిడ్ న్యూస్ విషయంలో సంబందిత అర్‌వో నోటీసులు జారీచేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు. నిర్దేశించిన రేట్ కార్డు ప్రకారం పెయిడ్ న్యూస్‌ను గుణించి, ఆ వ్యయాన్ని సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమచేయాటం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీచేసే లోక్ సభ అభ్యర్థి రూ.95లక్షలు, శాసన సభ అభ్యర్థి రూ.40లక్షలు వరకు వ్యయం చేసేందుకు అనుమతి ఉందన్నారు. ప్రింట్ మీడియాలో ప్రకటనలకు ముందస్తుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి అవసరంలేదని, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్, బల్క్ ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ యాడ్స్‌కు ఎంసీఎంసీ నుంచి అనుమతి అవసరమన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ కాపీ నెంబర్ కూడా ఆయా ప్రకటనపై సూచించాల్సి ఉంటుందన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా ప్రచురించే ప్రకటనలను ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పరిగణిస్తూ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ డా.పీ.సంపత్‌కుమార్; డీఆర్‌వో నివాసరావు, డీఐపీఆర్‌వో సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ.మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో రవి, కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత

విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్): రాష్ట్రంలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి గౌరవించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావుగారు అన్నారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆసిఫ్‌కు మద్దతుగా నియోజకవర్గ ఆర్యవైశ్యుల ఆత్మయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు, ఆసిఫ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ఆర్యవైశ్యులను దారుణంగా అవమానించారన్నారు. పొట్టిశ్రీరాములను అగౌరవపరిచారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత తమ సామాజిక వర్గానికి మంత్రి పదవిని కేటాయించటంతో పాటుగా పలువురు ఎమ్మెల్యేలుగా, చైర్మన్లుగా నియమించారని గుర్తు చేశారు. రాష్ట్ర అవతణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. వాసవీ సంస్థలను దేవదాయ శాఖ నుంచి తప్పించారని వివరించారు. తనను సెంట్రల్ నియోజకవర్గానికి అభ్యర్థిగా ప్రకటించారన్నారు. పశ్చిమంలో ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో ఆర్యవైశ్యులు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆసిఫ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దాన గుణం కలవారని, ఆధ్యాత్మిక చింతనతో నిత్యం సామాజిక సేవలో నిమగ్నమయ్యే వారన్నారు. అలాగే పార్టీ పక్షాన మీకందరికీ తాను అండగా ఉంటానన్నారు. ముఖ్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగాచేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. సభకు సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర, మండేపూడి ఛటర్జీ, సంఘం యువజన విభాగ నగర అధ్యక్షులు గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్థి పత్రాలు పోయినవి

నా క్లయింటు అయిన రాపర్ల శ్రీనివాసరావు తండ్రి లేటు పరంధామయ్య, హిందు, వయస్సు 53 సంవత్సరాలు, నివాసం: అమృత రెసిడెన్సీ, 4వ లైను, మాణిక్యనగర్, కారూరు(వి), పెనమలూరు(మ), కృష్ణాజిల్లా వారు పత్రికా ముఖంగా తెలియజేయునది ఏమనగా.. రావర్ల శ్రీనివాసరావు గారికి తన తండ్రి నుండి సంక్రమించిన ఆస్థి పత్రాలు (గిఫ్ట్ డీడ్ రిజిస్టర్డ్ నెం.491/1979) ది॥ 01-03-2024వ తేదీన తన నివాసం నుండి తన కుటుంబ ఖర్చుల నిమిత్తం ఆస్థిపత్రాలను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, పటమట బ్రాంచినందు కుదవ పెట్టి అప్పు తీసుకొనే ప్రయత్నంలో భాగంగా పత్రాలను నీలంరంగు సంచిలో పెట్టుకొని తన బండి మీద బయలుదేరగా మార్గమధ్యంలో ఆస్తి పత్రాలు ఉన్న నీలం రంగు సంచితో సహా పోయినది. ఇంటి నుండి పటమట బ్రాంచ్ ఎస్.బి.హెచ్ బ్యాంకు వరకు బాగా వెతికిననూ కనవడలేదు. ఈ ఆస్థిపత్రాలు మరియు నీలంరంగు సంచి ఎవరికైన దొరికిన ఎడల తిరిగి నా క్లయింటుకు తిరిగి ఇవ్వగలరు. అలా ఇచ్చిన వారికి తగిన పారితోషికము ఇచ్చెదను. గ్రామకంఠములోని నివేశన స్థలం చ.గ. 710లకు హద్దులు: తూర్పు: రావర్ల సత్యవతమ్మ గారి స్థలం కొంత వరకు, బజారు కొంతవరకు. దక్షిణం: వెంక్రటామయ్య గారి స్థలం కొంత వరకు, నడక సందు కొంత వరకు. పడమర: రాపర్ల సత్యవతమ్మ గారి స్థలం. ఉత్తరం: గొల్ల రవిగారు వగైరాల ఆస్థి.

ఇట్లు
ఎస్.లెనిన్, అడ్వకేటు,
ప్లాట్ నెం.65, 74-12-6/8ఏ, 4వ లైను, ఎలక్ట్రిసిటీ కాలనీ, పటమట, విజయవాడ, సెల్: 9908873140

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR (DIST REGISTRAR) AT VIJAYAWADA.
ARBITRATION/CLAIM PETITION No.93/ 2023

BETWEEN:
M/s. Shriram Chits (India) Pvt Ltd., Eluru Road Branch, Vijayawada. Rep by its: Legal Manager and G.P.A. Holder, Vijayawada. .... **DISPUTANT**

VERSUS

DINNIPATY PRATAP REDDY & 1 other .... OPPONENTS
OPP-1 Dinnipaty Pratap Reddy, S/o Sankar Reddy, Hindu, Male, aged about 44 years. Occupation: Business. Residence of D.No:4-129, Shivanagar, VTC Mandapalli, Chittor Dist, 517325, A.P.
OPP-2 M. Revathi, W/o Pratap Reddy, Hindu, Female, Aged about 39 Years, Occupation: Business, Residence of D.No: 4-129, Shivanagar, VTC Mandapalli, Chittor Dist, 517325, A.P.

Please take Notice that the above arbitration is filed by the Disputant for recovery of **Rs.7,30,900-00** Subsequent interest, costs, etc stands posted to **23-03-2024** for your appearance in Case of your failure to appear before the Hon'ble Court at **10-00 A.M.** on either in person or though Advocate, the matter will be decided Exparty.

By Order of the Court

Shriram Chits (India) Pvt Ltd
Eluru Road Branch, Vijayawada.
For: DISPUTANT

In the Court of the II Addl Senior Civil Judge, at Vijayawada
I.P.No.6/2023

Between :
S. Pothu Raju - **Petitioner**
And
Meka Bhushayya & Others
(R2) Tummalagunta Ganesh, S/o. Sambasiva Rao, H.No : 3-20, Beside Venugopala Swamy Temple, VTC, Garikapadu Post, Krishna District.
(R4) Panchakarla Kamal Kumar, S/o. Mani Kumar, R/o. D.No. 14-162, Prabhu kumar, Poranki, Vijayawada Rural, Krishna District.
(R7) Shaik Masthan Bee, S/o. Shaik Saheb, D.No.4-206-A, Edupugallu, Vijayawada Rural, Krishna District.
- Respondents

పై నంబరు గల పిటీషన్‌ను పిటీషనరు తనను ఇన్‌సాల్వెంటుగా ప్రకటించమని శ్రీకోర్టువారి ఎదుట దాఖలుపర్చినాడు. సదరు పిటీషన్‌లో గల **(ఆర్2) తుమ్మలగుంట గణేష్, తండ్రి : సాంబశివరావు,** డోర్ నెం. 3-20, వేణుగోపాలస్వామి గుడి ప్రక్కన, వి.టి.సి., గరికపాడు పోస్టు, కృష్ణాజిల్లా. **(ఆర్4) పంచకర్ల కమల్ కుమార్, తండ్రి మణికుమార్,** సి/ఓ. డి.నెం.14-162, ప్రభుకుమార్, పోరంకి, విజయవాడ రూరల్, కృష్ణాజిల్లా మరియు **(ఆర్7)** షేక్ మస్తాన్‌బీ, తండ్రి షేక్ సాహెబ్, డోర్.నెం.4-206-ఎ, ఈదుపుగల్లు, విజయవాడ, కృష్ణాజిల్లా వారలు శ్రీ కోర్టువారి నోటీసులు అందుకొనక జాప్యం చేయుచున్నారు. సదరు రెస్పాండెంట్లు నెం. **2,4 మరియు 7** వారలు శ్రీ కోర్టువారి ఎదుట హాజరు అవటానికి **3-4-2024**వ తేదీన వాయిదా వేసినారు. కావున రెస్పాండెంట్లు నెం. **2,4 మరియు 7 వారలు 3-4-2024వ తేదీన ఉదయం 10.30ని॥లకు** స్వయముగా కానీ, ప్లీడరు గారి ద్వారాగాని హాజరుకావలెను. అట్లు రానియెడల వారి పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 3-4-2024

Mr. R.V. Rama Krishna,
J. Dileep Kumar, Advocates,
Kaspavari Street, Governpet,
Vijayawada-2. cell : 9440175910.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

విశాలాంధ్ర-కంచికచర్ల: బీసిల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర తెలుగు మహిళ నాయకురాలు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఎలగాని నూకాలమ్మ తెలిపారు. కంచికచర్ల టిడిపి కార్యాలయంలో టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో నందిగామ నియోజకవర్గ బీసీ సెల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర తెలుగు మహిళ నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షు రాలుఎలగాని నూకాలమ్మ విచ్చేశారు. ఈ సందర్భంగా బీసీలను ఉద్దేశించి నూకాలమ్మ మాట్లాడు తూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే రాష్ట్రంలో ఉన్న బీసీ లకుఅనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి వాటిని నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. ఆనాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ల ద్వారా ఎందరో చేతి వృత్తుల పనివారికి వేలకోట్లసబ్సిడీ రుణాలను అందించడం జరిగిందన్నారు.నేడు ఈ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి బీసీ కార్పొరేషన్ల ద్వారా బీసీలకు అందాల్సినటువంటి రుణాలను ఎగవేత వేసివేల కోట్ల రూపాయ లనును తన సొంతానికి వాడుకున్న ఘను డని ఆమెఎద్దేవా చేశారు. బీసీ కార్పొరేషన్ లను నిర్వీర్యం చేసిన బీసీలు అంటూ జబ్బ జరుస్తూన్న ఈ ముఖ్యమంత్రి రాష్ట్ర లోను బీసీలను పచ్చిగా మోసం చేశారని ఆమె ఆరోపించారు. నేడు టిడిపి జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు బీసీల కొరకు ప్రవేశపెట్ట సంక్షేమ పథకాలు వాటిలో బీసీలకు 50 సంవత్సరాలకు పెన్షన్ 4 వేల రూపాయలు అమలు చేయడం, బీసీసబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో లక్షల నర కోట్లు ఖర్చు చేస్తాం వారి ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహకాలను పునర్దించడం జరుగు తుందన్నారు.స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు వైసిపి ప్రభుత్వం 34 శాతం నుండి 24 శాతానికి తగ్గించి 16,800 పదవులు దూరం చేశారని ఆమె తెలియజేశారు. టిడిపి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునర్దించడానికి జాతీయ పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని, అన్ని సంస్థల్లో నామి నెటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు, చట్టబద్ధంగా కుల గణన నిర్వహిస్తాం, చంద్రన్న బీమా 10 లక్షలతో పునర్దిస్తాం పెళ్లికానుకులను లక్ష రూపాయలకుపెంపు, విద్యా పథకాలు అన్ని పునర్దిస్తాం, బీసీ భవనాలు కమిటీ హాళ్లను నిర్మాణాలను ఏడాదిలో పూర్తి చేస్తామని టిడిపి జాతీయ నాయకులు చంద్రబాబు నాయుడు హామీ చేశారని బిసి నాయకుల కు నోకాలమ్మ బీసీలంతా ఏకతాటితో ఏకమై చంద్రబాబు నాయుడు బీసీలకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన అటువంటి ప్రవేశపెట్టినట్టు ప్యాక్ మేనిఫెస్టోను గ్రామాలలో నున్న బీసీ సోదరీ సోదరులకు అర్థమయ్యే రీతిలో విస్తృతంగా ప్రచారం చేసి నందిగామ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడే విధంగా టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థిని తంగిరాల సౌమ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకుప్రతి ఒక్క బీసీ సోదరులువిజయకేతనాన్ని ఎగరవేసేందుకు రేపు జరగబోవు అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలకు సమయత్వం కావాలని బీసీ సోదరి సోదరులకు నూకాలమ్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిలుఅల్లడి కోటేశ్వరరావు, మన బోతుల శ్రీరామ్, నందిగామ టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వీరాంకి వీరాస్వామి, జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు గుప్పల సత్యనారాయణ, కోటేశ్వరమ్మ, దాసరి ప్రభు, పరిటాల శివకుమార్, నల్ల నాగుల అరుణ, గూడవల్లి గణేష్, ఒంటి పులి శంకర్, కుక్కల శ్రీను, తదితరబీసీ నాయకులు పాల్గొన్నారు.

ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: విమానయాన రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని బెంజ్ సర్కిల్ ఏర్పాటు చేసిన ఏరో ఫాల్కాన్ ఏవియేషన్ సర్వీసెస్ అండ్ ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ దిలీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో తొలి ఏవియేషన్ అకాడమీ ప్రారంభించామని ఇక్కడ శిక్షణ పొందిన వారికి వంద శాతం ఉపాధి కలుగుతుందని తెలిపారు సరైన శిక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోందని దీన్ని దృష్టిలో పెట్టుకుని విజయవాడలో తాము కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అకాడమీ డైరెక్టర్ తెలిపారు.ఏవియేషన్ సంబంధించిన అన్ని రకాల శిక్షణలు అందిస్తామని పేర్కొన్నారు .

హంగ్రీ ఫర్ గోల్డ్‌తో బ్రిటానియా నూతన క్యాంపెయిన్

విశాలాంధ్ర-విజయవాడ(వన్ టౌన్) : ప్రముఖ బిస్కెట్ బ్రాండ్ బ్రిటానియా, భారతదేశంలో ఒక మతంగా కొనసాగుతున్న క్రికెట్‌కు మించి, క్రీడల పట్ల ఆసక్తిని పెంచే దిశలో కొత్త క్యాంపోయిన్‌ను ప్రారంభించిందన్నారు. భారతదేశం కోసం బ్రిటానియా ఒక కొత్త విజన్‌ను జారీలోకి తీసుకు వచ్చేందుకు టాలెంటెడ్ ఏజన్సీని నియమించిందన్నారు. ఇది ఆశాజనకమైన, జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ భాగస్వామ్యంతో రూపొందించారు. ఆ విధంగా హంగ్రీ ఫర్ గోల్డ్ తెరపైకి రాగా, తమ తాజా క్యాంపెయిన్‌లో భారతదేశంలోని ఆరుగురు ప్రముఖ అథ్లెట్లు దేశవ్యాప్తంగా విభిన్న క్రీడలు, జెండర్లు, రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఫిట్జీ ద్రోణాచార్య-2 స్కాలర్‌షిప్ పరీక్ష ప్రారంభం

విశాలాంధ్ర - విజయవాడ(వన్ టౌన్) : భారతదేశంలో పోటీ పరీక్షల స్వరూపాన్ని మార్చే దిశగా గణనీయమైన పురోగతితో, దేశంలోని ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ అయిన ఫిట్జీ, ద్రోణాచార్య-2 స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించనున్నామని ప్రకటించారు. ఈ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహించబడుతుంది. ఆరు నుంచి 12 తరగతులకు వెళ్లే విద్యార్థులు పాల్గొనడానికి అర్హులు. 6, 7, 8 తరగతులకు వెళ్లే విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 750 కాగా, ఆపై తరగతులకు రూ. 1500గా నిర్ణయించారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజుపై 99 శాతం వరకు ఫీజు మినహాయింపు రూపంలో ప్రోత్సాహకాలను కూడా పొందవచ్చు. పరీక్ష కోసం నమోదు చేసుకోవడానికి ఏప్రిల్ 5 చివరి తేదీ అని ఫిట్జీ ప్రకటించింది.

వెనిగండ్ల రాముకు అశేష ప్రజాదరణ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని కూరాడ గ్రామంలో సోమవారం టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీల అభ్యర్థి వెనిగండ్ల రాము, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికి టిడిపి కార్యక్రమాలు నిర్వహించారు. కూరాడ లాకుల వద్ద కూటమి పార్టీల నాయకులు, ప్రజలు రాముకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాము ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ, సూపర్ సిక్స్ మేనిఫెస్టో అంశాలను ప్రజానీకానికి వివరించారు. రాముకు వీధి వీధినా మహిళలు మంగళహారతులతో రాముకు స్వాగతం పలికారు. వివిధ వర్గాల ప్రజానీకంతో మమేకమవుతూ, ఆత్మీయ పలకరింపుల మధ్య విజయవంతంగా సాగిన రాము పర్యటనలో పూర్తిగా పూడికపోయి, దుర్భర స్థితిలో ఉన్న కూరాడ పంట కాలువ పరిస్థితిపై, దళితవాడలలోని రోడ్ల దుస్థితిపై రాము సెల్ఫీ చాలెంజ్ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు టిడిపి అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, పార్టీ నాయకులు కొడాలి రామరాజు, వల్లభనేని బాబురావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట చిన్నారి, కూరాడ టీడీపీ నాయకులు వాసా శ్రీరామచంద్రమూర్తి, కళ్యాణపు నవాబు,సీరం నాగ రమేష్, పులి ప్రసాద్, మద్దాలి నాని, సీరం సుబ్బారావు, దాసరి కృష్ణారావు, సాయన బాబురావు, రావాడ గోపాల్, ఆకుల శివయ్య మండల టీడీపీ నాయకులు సాయన పుష్పావతి, అడుసుమిల్లి చిట్టిబాబు, వి. శివప్రసాద్, బొప్పన శివప్రసాద్, పొట్లూరి రవి, చాపరాల బాలాజీ, చాపరాల రాజా, సురగాని ప్రసాద్, కాగిత నరేంద్ర, గోవాడ శివ, చింతలగుంట మోహన్, పామర్తి కన్య భాస్కరరావు, ఆకుల శివయ్య, దేవిశెట్టి రామకృష్ణ, ఎస్ ప్రసాద్, జంగం మోహన్, సమ్మెట సాంబయ్య, తూము పద్మజ, తెల్లాకుల నాగలక్ష్మి, దివ్య చౌదరి, మన్యం పద్మావతి, నిమ్మగడ్డ శశికళ, దారా సత్యనారాయణ, అందువల్ల ఏసుపాదం, మరీదు రోహిణి కుమార్, సొంటి కోటయ్య, మద్దికూరి ప్రభాకర్, మన్యం నరసింహారావు, నిమ్మగడ్డ సత్యసాయి, గుడివాడ జోన్స్, మాదాస్ ప్రసాద్, గూడూరు సురేంద్ర, గద్దం ప్రకాష్ దాస్, సురగాని సూరిబాబు,గుడివాడ నియోజకవర్గ టిడిపి జనసేన ముఖ్య నాయకులు, తెలుగు మహిళ, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, ఐ.టీడీపీ,టీడీపీ జనసేన అనుబంధ విభాగాల నేతలు,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్పతరు ప్రాజెక్ట్స్‌లో ఐదుగురికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: భారత దేశంలోనే అతిపెద్ద నిర్మాణ సంస్థ అయిన కల్పతరు ప్రాజెక్ట్స్ వారు ఈ నెల ఒకటవ తేదిన గవర్నమెంట్ మరియు ప్రైవేట్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రాంగణ నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా తుది ఫలితాలను శుక్రవారం ప్రకటించారు. వారిలో రాష్ట్ర వ్యాప్తంగా గవర్నమెంట్, ప్రైవేట్ పాలిటెక్నిక్ ల నుండి 15 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వారిలో అత్యధికంగా గుడ్లవల్లేరు ఏ.ఏ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్.పాలిటెక్నిక్ నుండి 5 గురు సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూ.2.75 లక్షల వార్షిక వేతనంతో కొలువులు సాధించారని, కొలువులు సాధించిన వారికీ కల్పతరు సంస్థవారే పూర్తి ఉచిత వసతి,భోజన సదుపాయాలు కల్పిస్తారని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలియజేసారు. విద్యార్థులు అతిచిన్న వయస్సులోనే కొలువులు సాధించడం అనేది ఒక్క డిప్లొమా విద్యతోనే సాధ్యపడుతుందని ప్రిన్సిపాల్ ఈ సందర్భగా పేర్కొన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎమ్. వినయ్ ని, కొలువులు సాధించిన విద్యార్థులను, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి.ఎమ్.ఎన్.కిరణ్ లను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో-సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి. రామాంజనేయులు, ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ అభినందించారు.

'పది' పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): జిలాల్లో పది పరీక్షలు కోలాహలంగా ప్రారంభమైంది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 178 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో స్థానిక విద్యాధరపురం, అరవిందవీధిలో ఉన్న బెజవాడ రాజారావు హైస్కూల్లోను ఈ సంవత్సరం నూతనంగా పరీక్షా కేంద్రంగా ఎంపిక చేయడం జరిగింది. 178 మంది విద్యార్థులను చుట్టు ప్రక్కల నున్న వివిధ పాఠశాలల నుండి ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం 30 పాఠశాలల నుండి విద్యార్థులు రావడం జరిగింది. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను "ఉత్సాహంగా పరీక్షా కేంద్రాలకు పంపించడం జరిగింది.

ఎన్నికల కోడ్‌తో పార్టీ రంగులు మాయం !

విశాలాంధ్ర-అవనిగడ్డ : దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ శనివారం నుండి అమలు కావడంతో ఫ్లెక్సీలను తొలగించి రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశారు. అవనిగడ్డ పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవనిగడ్డ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను ఎన్నికల కోడ్ అమలు అయిన వెంటనే తొలగించాలని సూచించినప్పటికి ఎవరూ తొలగించకపోవడంతో సోమవారం తోట శ్రీనివాసరావు దగ్గరుండి పంచాయితీ పరిధిలో ఏర్పాటు పలు పార్టీలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగించారు. అదే విధంగా రాజకీయ నాయకులు విగ్రహాలకు ముఖాలు కనబడకుండా ముసుగు సైతం వేయడంతో ఎన్నికల కోడ్ పంచాయితీ పరిధిలో కొట్టొచ్చినట్లుగా కనబడింది. 2022 నవంబర్ నెలలో జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డ బహిరంగ సభ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రి కళాశాల ఆవరణ, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లకు సైతం అధికార పార్టీ రంగులు వేయడంతో ఆ రంగులను మాఫీ చేసేందుకు తెల్ల రంగులు వేయడం ప్రధాన, ప్రతిపక్ష పార్టీల జెండా దిమ్మలకు సైతం తెల్ల రంగులను వేయడంతో పాటు పార్టీ నేతలు ప్రజలు కుర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయగా ఆ బెంచీల రంగులను, గుర్తులను సైతం తోలగించేందుకు రంగులు వేస్తున్నారు.

వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని బహుజన వర్గాలు డిమాండ్ చేశారు. ఆదివారం ఎ1 మార్ట్‌లో జరిగిన వెనుకబడిన వర్గాల రాజకీయ ఐక్య కార్యాచరణ నేతల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మాలమహనాడు అధ్యక్షులు దోవా గోవర్ధన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గానికి వెనుకబడిన వర్గాల నుండి బలమైన రాజకీయ నేతను బరిలో నిలుపుతున్నట్లు ప్రకటించారు. అత్యధిక ఓట్లు కలిగిన సామాజిక వర్గాలను విస్మరించడం తగదని పలువురు పేర్కొన్నారు. ఎస్.సి., ఎస్.టి, బిసి. మైనారిటీ ముఖ్య నేతల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా రైల్వే కాంట్రాక్టర్ టి ఎస్ ఆర్ గ్రూప్ అధినేత శ్రీనివాసరావు పాల్గొని మాట్లాదారు. నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా ఒకే సామాజిక వర్గం రాజకీయ బరిలో నిలవడం, ఇతర వెనుబడిన వర్గాలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరించడం వారి వెనుకబాటు తనానికి కారణం అన్నారు. సామాజిక సేవలో, ప్రజా ఉద్యమాల్లో ముందుండే వ్యక్తులను నిజాయితీ పరులను, తమ అభ్యర్థిగా ఎన్నుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ వర్గాలపై ఒకే సామాజిక వర్గం రాజకీయ పెత్తనం చేస్తూ, ఏళ్ళ తరుబడి అధికారాన్ని అనుభవిస్తున్నారని, ఆ రాజ్యాధికారాన్ని బిసిలకే అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అందుకు తగిన బలమైన అభ్యర్ధిని బిసి, ఎస్.సి, ఎస్.టి వర్గాల నుండి 2024 ఎన్నికల బరిలో నిలిపేందుకు కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్ర ఫిషర్‌మెన్ సంఘ కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది సైకం రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో బిసిలకు మరో బలమైన సామాజిక వర్గంగా ఉన్న అగ్నికుల క్షత్రియుల నుండి ఒక అభ్యర్ధిని ఎన్నికల బరిలో నిలపడం గానీ, ఇతర బిసి అభ్యర్థికి మద్దతు ఇవ్వడం కానీ చేసి బిసి అభ్యర్థి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి బిసి చైతన్య వేదిక అధ్యక్షులు బిసి రమణ, ఎఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి కోట కరుణకుమార్, అంద్రాజు శ్రీనివాసరావు, ఎస్.టి సంఘం నేత బోడా వెంకన్న, వడ్డెర సంఘ నేత వేముల వెంకటేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం ఎల్ ఆచారి, బొల్లా ఫణిబాబు, అవనిగడ్డ మాజీ ఎం.పి.పి దిడ్ల ప్రసాద్, లుక్కా పిచ్చయ్య, మైనారిటీ సంఘ నేత ఎన్ ఖాధర్ వలి, పోతర్లంక రమేష్, అవనిగడ్డ రజనీకాంత్, కాగితాల సుదర్శన్‌లతో పాటు పలు సంఘాల నేతలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాల శివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : బాలశివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణచిరువోల్లంక మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణా నదీ నడుమ వెలసిన బాలశివశంకర భగవాన్‌కు శోభాకృత నామ సంవత్సరం ఉత్తరాయనం, శిశిర ఋతువు, పాల్గునమాసం, శుక్లపక్షం, దశమి తిధిని పురస్కరించుకుని సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వామి వారికి నవవిధ అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ముందుగా స్వామి వారిని కృష్ణానదీజలాలతో అభిషేకించారు. ఆలయ అర్చకులు కాశీభట్ల సుబ్బయ్య శాస్త్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు గోత్రనామాలతో పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా దివిసీమ నుండే కాకుండా జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ ఆవరణలో గల గణపతి కుమారస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించి నాగేంద్రస్వామి వారి పుట్టలో పాలు పోసి పూలు, పండ్లతో పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు.

వైద్యులు, స్టాఫ్ నర్సుల వివరాలు నమోదు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయు ష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలలో పని చేసే వైద్యులు, స్టాఫ్ నర్సుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)డాక్టర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని సెంటర్ల రెన్యువల్స్‌ను నిలిపివేయబడతాయని అన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణ నియోజకవర్గాలలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుండి 12.45 ని॥ల వరకు జరిగాయి. విద్యార్థులు పరీక్ష సమయానికే పాఠశాలలకు చేరుకున్నారు. అన్ని కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పాఠశాలల వద్ద విద్యార్థులకు కావలసిన అన్ని ఏర్పాట్లను పాఠ శాల నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కమీషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్త ర్వుల ప్రకారం సోమవారం అన్ని పాఠశాలలలో పరీక్షలు నిర్వహించారు.

నగరంలో పెమ్మసాని వైబ్రేషన్స్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఇపుడు ఎక్కడ చూసినా మ్మసాని వైబ్రేషన్స్ కనిపిస్తున్నాయని ప్రముఖ వైద్యులు మన్నవ రాధా కృష్ణ మూర్తి (ఎండీ) చెప్పారు. స్థానిక బ్రాడి పేటలోని మన్నవ నివాసానికి వెళ్లిన టీడీపీ నాయకులు డా.పెమ్మసాని చంద్రశే ఖర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డా.మన్నవకు శాలువా కప్పి సత్కరించిన పెమ్మసాని కాసేపు ఆయనతో మాట్లాడారు. వైద్యునిగా మన్నవకు ఉన్న అనుభవం తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చించుకున్నారు. వైద్యులు రాధా కృష్ణ మూర్తి మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో ప్రజలందరూ చర్చించుకునే స్థాయి అందరికీ దక్కదని, ఆ స్థాయిలోనే ముందుకు వెళ్లాలని సూచించారు.

పట్టణంలో కాగితకు బ్రహ్మరథం పడుతున్న మహిళలు

విశాలాంధ్ర-పెడన : పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళలు కర్పూర హారతులతో దీవెనలు ఇచ్చి బ్రహ్మరథం పడుతున్నారని టిడిపి జనసేన బిజెపి పార్టీల పెడన శాసనసభ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు, నాయకుల సారథ్యంలో 12, మరి 13 వార్డుల ఇన్చార్జిల అధ్యక్షతన గడపగడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమూల్యమైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థి సైకిల్ గుర్తుకు ఓటు వేసి, ఎంపీ అభ్యర్థి గుర్తు గాజు గ్లాస్ ఓటేసి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ను, శాసనసభ సభ్యునిగా నన్ను కాగిత కృష్ణ ప్రసాద్ ను దీవించి ఆశీర్వదించాలని ఇంటింటా తిరుగుతూ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్ లను అందిస్తూ స్థానికంగా ఉన్న వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య, రాష్ట్ర దేవాంగ సాదికార కమిటీ సభ్యులు యర్రా. నాగరాజు(రాజా) రాష్ట్ర శిష్ట కర్ణ సాధికార కమిటీ సభ్యులు వీణం. శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వహ కార్యదర్శి హామీదుల్ల (గుజ్రాల్)12వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ మట్టా. పావని, 14వ వార్డు కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ, జనసేన పార్టీ నాయకులు కూనపరెడ్డి రంగయ్య నాయుడు, వెలిగట్ల ప్రసాద్, కోరుమిల్లి వెంకట స్వామి, బళ్ళ సుబ్రహ్మణ్యం,సేనాపతి అజయ్ కుమార్,దాదా ఉమ్మడి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వడ్డేరలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్రంలో వడ్డెరలకు సము చిత స్థానం కల్పించాలని చట్ట సభలలో అవకాశం కల్పించా లని వడ్డెర సాధికారత రాష్ట్ర సభ్యులు వడ్డే వెంకట్ కోరారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సోమవారం సాయంత్రం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో వడ్డెర సాధికారత కమిటీ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు వేముల శివ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడనుండైనా వడ్డెరలకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు తిరుపాల్ బాబు, స్టేట్ మెంబర్ గుంజి అంకమ్మరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వడ్డెరలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. వడ్డెర్లు మంగళగిరిలో నారా లోకేష్‌కి అండగా ఉండి గెలిపించాలంటే వడ్డెర్లకు సముచిత స్థానం కల్పించాలన్నారు. నియోజకవర్గ అధ్యక్షులు వేముల శివ మాట్లాడుతూ త్వరలో మంగళగిరి నియోజకవర్గంలో వడ్డెర్ల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు గొడ్డెలగల జయలక్ష్మి, గొడ్డెలగల శ్రీనివాసులు, వేముల దుర్గారావు, ఉప్పుతల వాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి గుండె జబ్బుల ఓపీ సేవలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జీజీహెచ్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతిరోజూ గుండె జబ్బుల ఓపీ సేవలు చూస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని క్షయ నియంత్రణ కేంద్రాన్ని ఆయన పరిశీలిం చారు. గత రెండు నెలల నుంచి టీబీ సెంటర్‌లో గుండె జబ్బుల ఓపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అందుకు తగ్గట్టుగా గుండె జబ్బుల ఓపీని సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ టీబీ కేంద్రాన్ని మహిళల పీజీ వసతి గృహం ఎదురుగా ఉన్న నూతన భవనంలోకి మారుస్తున్నట్లు వెల్లడించారు. గుండె జబ్బుల ఓపి వైద్యులకు, రోగులకు అందుబాటులో ఉండేవిధంగా ఆరు గదులను ఆధునీకరిస్తున్నామని, సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ సేవలను విస్తరింపజేస్తున్నట్లు వ్యాఖ్యానించారు. జింఖాన అధ్యక్షుడు డాక్టర్ పొదిల ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్ ఉన్నారు.

మోదీ ప్రత్యేక హోదా మాట్లాడకపోవడం శోచనీయం

విశాలాంధ్ర, తెనాలి : చిలక లూరిపేట ప్రాంతంలో జరిగిన ప్రధానమంత్రి మోదీ, చంద్ర బాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ల సభలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాను గురించి మాట్లాడకపోవడం విచారకరమని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు విమర్శించారు. బిజెపి, దాని మిత్రపక్షాల సభలో కేవలం వారి స్వలాభాపేక్ష ప్రసంగాల మినహా దేశ, రాష్ట్ర అభివృద్ధిని గురించి ఏమాత్రం మాట్లాడలేదని అది ప్రజలు గ్రహించాలన్నారు. 10 ఏళ్ల పాలనలో మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య వైసమ్యాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్దిపొందాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో నాగసూర్య, శశిధర్, శివకుమార్, సత్యనారాయణ, కృష్ణ, వీరయ్య, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముస్లింల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని మిర్చియార్డ్ మాజీ డైరెక్టర్ షేక్ చిన్న బాజీ అన్నారు. సోమవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన వేల కోట్ల రూపాయలు నిధులు దారి మళ్లించి రాష్ట్ర ముస్లిం మైనార్టీలకు తీరని ద్రోహం చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పటానికి మైనారిటీలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. దైవదర్శనానికి హజ్ యాత్రకు వెళ్లే వారికి హజ్ హౌస్‌ల నిర్మాణం, వారికి సబ్సిడీలు, దుల్హన్ పథకం అందిస్తానని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి ముస్లింల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తూ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. కె.యం.ఇ హుస్సేన్, ఫుల్లా సుందరాంబాబు పాల్గొన్నారు.